క్లుప్తంగా

వారాంతపు సంత

సాక్షి, సిటీబ్యూరో: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని గాంధీనగర్, దుర్గానగర్, అల్వాల్ సర్కిల్ పరిధిలోని వెస్ట్ వెంకటాపురం ప్రాంతాల్లో సోమవారం తైబజార్ (వారాంతపు సంత) నిర్వహిస్తారు.

వైద్య సేవలు..

అల్వాల్, మల్కాజిగిరి, జవహర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో సోమవారం గర్భిణుల పేర్లు నమోదు, సాధారణ చికిత్సలు, హోమియో వైద్య సేవలు అందిస్తారు.

ఇంద్రానగర్ కాలనీ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌యాదవ్



ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ ప్రాంతానికి చెందిన ఇంద్రానగర్ కాలనీ నూతన అధ్యక్షుడిగా ముద్దం శ్రీనివాస్ యాదవ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం నిర్వహించిన కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో సమీప అభ్యర్థి మల్లేష్‌పై గెలుపొందారు. కార్యక్రమంలో కాలనీవాసులు రామచంద్రారెడ్డి, జంపని బాలకృష్ణాగౌడ్, రమేష్ గౌడ్, రాజేష్ గౌడ్, పిల్లి సంజీవ, రఫిక్ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



మౌలాలి: మౌలాలి కార్పొరేటర్ గున్నాల సునీతాశేఖర్ యాదవ్ సహకారంతో విజయ డయాగ్నోస్టిక్స్, కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గీతానగర్ కాలనీ పార్కులో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో స్థానికులు హాజరై పలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్రశేఖర్‌యాదవ్, పవన్‌కుమార్, నాగేశ్వర్‌రావు, లక్ష్మీనారాయణ, అంకమ్మరావు, శ్రీనివాస్‌రావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి నిత్యావసరాల వితరణ



ఆశ్రమానికి నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న నర్సింహారావు

బోడుప్పల్: లక్ష్మీనగర్‌కు చెందిన నర్సింహారావు పుట్టిన రోజును పురస్కరించుకుని మేడిపల్లిలోని ఆలనా అనాథ ఆశ్రమానికి ఆదివారం నిత్యావసర వస్తువులను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ మాజీ అధ్యక్షుడు మల్లప్ప, వాకింగ్ ఫ్రెండ్స్ సభ్యులు ప్రభు, వెంకట మల్లారెడ్డి, రమణ పాల్గొన్నారు.

కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడమే లక్ష్యం



అనాథాశ్రమంలో దుప్పట్లను పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు

ఉప్పల్: కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడంలో ఉన్న ఆనందం అంతా..ఇంతా.. కాదని శ్రీరామదూత చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు బాలకృష్ణ, వినయ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఉప్పల్ స్వరూప్‌నగర్‌లోని ఆశాకు టీర్ ఫౌండేషన్‌లోని అంధ బాలికల వసతి గృహంలో ట్రస్టు ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వసతి గృహం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దత్తత

అల్వాల్: నేరేడ్‌మెట్ చౌరస్తాలో ఆదివారం ఎన్‌జీఓస్ సహకారంతో కుక్కలను దత్తత తీసుకునే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాయింట్ కమిషనర్ ఉమాప్రకాష్, వెటర్నరీ విభాగం తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ నిధుల ఫ్రీజింగ్ తొలగించాలి

మేడ్చల్: గ్రామ పంచాయతీ నిధుల ఫ్రీజింగ్‌ను ప్రభుత్వం తొలగించాలని తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధికార ప్రతినిధి సురేందర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం మేడ్చల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పంచాయతీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించి గ్రామాలాభివృద్ధికి అడ్డుకట్ట వేస్తోందని, నిధులు విడుదల కాక సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సుమారు 6 నెలలుగా గ్రామాల్లో చేసిన పనులకు బిల్లులు రాక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్మికుల వేతనాలు రాక నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుందని, సీఎం కేసీఆర్ వెంటనే స్పందించి ఫ్రీజింగ్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు..

అంతా సిద్ధం

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 14 పోలింగ్ కేంద్రాలు.. 6,536 మంది ఓటర్లు



- ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లిన అధికారులు, సిబ్బంది
- డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పర్యవేక్షించిన కలెక్టర్ అమయ్‌కుమార్
- నేడే పోలింగ్



సాక్షి,మేడ్చల్ జిల్లా: హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికలకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధికార యంత్రాంగం అంతా సిద్ధం చేసింది. ఈ నెల 13వ తేదీ సోమవారం (నేడు) జరుగనున్న ఈ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలోని ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో 14 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలతో పాటు సిరా, ఇతర సామగ్రిని ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, సిబ్బందికి అప్పగించారు. వీరంతా వారికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో పోలీసు బందోబస్తు నడుమ కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. కాగా ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ అమయ్‌కుమార్ పర్యవేక్షించగా ఇందులో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, డీఆర్‌ఓ లింగ్యానాయక్, కలెక్టరేట్ ఏఓ వెంకటేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

29,720 మందిలో 6,536 జిల్లా ఓటర్లే...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 14 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. ఇందులో ఎనిమిది కీసరలో, ఆరు పోలింగ్ కేంద్రాలను మల్కాజిగిరిలో ఏర్పాటు చేశారు. ఈ నెల 13వ తేదీ సోమవారం (నేడు) ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమై సాయంత్రం వరకు ఎన్నికలు పటిష్ట భద్రతల నడుమ జరగనున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ నియోజకవర్గం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మొత్తం ఓటర్లు 29,720 ఉండగా.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 6,536 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్లు 3,498 మంది కాగా.. పురుష ఓటర్లు 3,038 మంది ఉన్నారు.

సాధారణ ఎన్నికల మాదిరిగానే...

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను సాధారణ ఎన్నికల మాదిరిగానే నిర్వహించేందుకు ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులను నియమించారు. అలాగే ఎన్నికలు జరిగే అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ద్వారా ఎప్పటికప్పుడు ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను ఎల్‌బీనగర్‌లోని సరూర్‌నగర్ స్టేడియంకు పోలీసు బందోబస్తు మధ్య తరలిస్తారు. 16న సరూర్‌నగర్ స్టేడియంలో ఓట్ల లెక్కింపు జరగనుంది.

బరిలో 21 మంది.. ప్రధాన పోటీ ఇద్దరి మధ్యే..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రత్యక్షంగా రాజకీయ పార్టీలతో సంబంధం లేకపోయినప్పటికీ.. ఆయా అభ్యర్థులకు పరోక్షంగా పలు పార్టీలు ఆర్థిక వనరులను సమకూర్చాయి. ఎలాగైనా ఈ సీటును మళ్లీ తమ ఖాతాలో వేసుకోవాలని అధికార బీఆర్‌ఎస్ యత్నిస్తుండగా.. సీపీఎం, బీజేపీ, కాంగ్రెస్, సీపీఐలు కూడా తమ అనుబంధ సంఘాల అభ్యర్థుల గెలుపు కోసం గట్టిగానే ప్రయత్నిస్తున్నాయి. మూడు జిల్లాల పరిధిలో మొత్తం 21 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో టీఎస్ యూటీఎఫ్ తరఫున పాపన్నగారి మాణిక్‌రెడ్డి పోటీ చేస్తుండగా, పీఆర్‌టీయూ నుంచి చెన్నకేశవరెడ్డి, టీపీఆర్‌టీయూ అభ్యర్థిగా ప్రస్తుత మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం అభ్యర్థిగా ఏవీఎన్ రెడ్డి, టీయూటీఎఫ్ అభ్యర్థిగా దేవన్నగారి మల్లారెడ్డి, ఎస్టీయూ నుంచి భుజంగరావు, మహబూబ్‌నగర్ నుంచి గతంలో పోటీ రిటైర్డ్ డీఈఓ విజయ్‌కుమార్, హర్షవర్ధన్‌రెడ్డిలు పోటీలో ఉన్నారు. గత ఎన్నికల్లో 12 మంది అభ్యర్థులు బరిలో నిలవగా, వీరిలో జనార్దన్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, ఏవీఎన్ రెడ్డిల మధ్య తీవ్రపోటీ జరిగింది. తొలి ప్రాధాన్యత ఓటు దక్కకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్లతో జనార్దన్‌రెడ్డి విజయం సాధించారు. ఈ సారి ఎన్నికల్లో టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థి మాణిక్‌రెడ్డి, పీఆర్‌టీయూటీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డిల మధ్యే ప్రధాన పోటీ కన్పిస్తోంది.

పోలింగ్ స్టేషన్లు, ఓటర్ల వివరాలు ఇలా..

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓటర్లు
మహబూబ్‌నగర్	15	3,461
నాగర్‌కర్నూల్	14	1,822
వనపర్తి	7	1,335
జోగులాంబ గద్వాల్	11	877
నారాయణపేట్	5	664
రంగారెడ్డి	31	9,186
వికారాబాద్	18	1,890
మేడ్చల్–మల్కాజిగిరి	14	6,536
హైదరాబాద్	22	3,949
మొత్తం	137	29,720

జిల్లా పరిషత్ బాలుర పాఠశాల సిద్ధం



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన పోలీసులు

మల్కాజిగిరి: హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్‌కు మల్కాజిగిరిలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో సుమారు 511 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఆదివారం పోలింగ్ కేంద్రాన్ని పోలీస్ అధికారులు పరిశీలించారు.

13వ వసంతంలోకి వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ



నాయకులతో కలిసి కేక్ కట్ చేస్తున్న సిద్దిపేట జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు తడక జగదీశ్వర్ గుప్తా

అల్వాల్: వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ 12 వసంతాలు పూర్తి చేసుకుని 13వ వసంతంలోకి అడుగుపెట్టడం పార్టీ అనుసరిస్తున్న విధి విధానాలు, నిబద్ధతకు నిదర్శనమని సిద్దిపేట జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు తడక జగదీశ్వర్ గుప్తా అన్నారు. నగరంలోని రామకృష్ణాపురంలో పార్టీ జెండాను ఆవిష్కరించి అనంతరం కేక్ కట్ చేసి పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆ పార్టీ నాయకులతో పాటు భారీ స్థాయిలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

పేదల కోసం సేవా కార్యక్రమాలు

కుషాయిగూడ: నిరుపేదలకు అండగా ఉండేందుకు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని మధుర చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు అన్నారు. కంటి ఆపరేషన్ చేయించుకున్న చర్లపల్లి డివిజన్‌కు చెందిన వారికి ట్రస్ట్ చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రొయ్య వెంకటేష్‌గౌడ్, ముస్తక్ హైమద్, ముత్యాలు, సోమేశ్వరరావు, పరశురావుయాదవ్, మహేష్, ప్రకాష్, సంతోష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



మధుర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నృత్యం.. శోభితం



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సెలవు రోజు ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. త్రిబాల, త్రిపుర సుందరి కూచిపూడి నృత్య నిలయం గురువు భవాని తొణకునూరి శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. వాతాపి గణపతిమ్ భజేయ, కొలువైతివా రంగాసాయి వచ్చెను, అలమేలు మంగ, భోశ్శంభో, భావములోన, దశావతారాలు తదితర అంశాలపై నృత్య ప్రదర్శన చేసి మెప్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హెచ్ఎండీఏ ఓఎస్‌డీ రాంకిషన్, డిప్యూటీ ఈఈ కరుణలు విచ్చేసి కళాకారులు సత్కరించారు.

జమ్మిగడ్డలో జ్ఞానమాల కార్యక్రమం



జమ్మిగడ్డలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ జమ్మిగడ్డలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. 41 వారాలుగా కొనసాగుతున్న ఈ కార్యక్రమం వివిధ ప్రాంతాలకు కూడా విస్తరింపజేయాలని పలువురు అన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధి తాడూరి గగన్‌కుమార్, జిల్లా టీజేఎస్ అధ్యక్షుడు ఆంజనేయులు, హెచ్‌ఆర్‌పీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, జిల్లా దళిత శక్తి ప్రోగ్రాం సభ్యులు శ్రీధర్, బీజేఆర్ కాలనీ అధ్యక్షుడు ఎస్‌ఏ రహీం, స్థానిక నాయకులు శ్రీనివాస్, రవినాయక్, దయానంద్, నరేష్, గిరి, రాజు, నరేందర్‌రావు పాల్గొన్నారు.

సఫిల్‌గూడ రైల్వే గేట్ తెరిపించాలి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మూసివేసిన సఫిల్‌గూడ రైల్వే గేట్‌ను తెరిపించాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ ఆదివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ సఫిల్‌గూడ రైల్వే గేట్ మూసివేయడంతో బలరాంనగర్, దేవీనగర్, సీతారాంనగర్ తదితర ప్రాంత ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులకు గురవుతున్నారని, ఇటీవల ఆ కాలనీల్లో పర్యటించినప్పుడు తెలియజేశారన్నారు. ఆ ప్రాంతంలో ఆర్‌యూబీ నిర్మాణానికి అవకాశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశామన్నారు.

ఘనంగా 'మాస్టర్ మైండ్స్' వార్షికోత్సవం



ప్రొ.కోదండరామ్‌ను సన్మానిస్తున్న స్కూల్ యాజమాన్యం

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలానగర్‌లోని ది మాస్టర్‌మైండ్ స్కూల్ రెండో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, రిటైర్డ్ ప్రొఫెసర్ కోదండరామ్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం కోదండరామ్‌ను స్కూల్ యాజమాన్యం శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, ప్రిన్సిపాల్ భువనేశ్వరి, టీఎంఎంఎస్ చైర్మన్ సంగాని రాజు, అకాడమీ డైరెక్టర్ విజయసారధి, సీఈఓ రజిత్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కల్యాణ మహోత్సవంలో ఆలయ కమిటీ సభ్యులు

వైభవంగా ఎల్లమ్మ కల్యాణం

మల్లాపూర్: నాచారం న్యూ రాఘవేంద్రనగర్ కాలనీలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం అమ్మవారి కల్యాణ వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మేకల ముత్యంరెడ్డి, సీఎస్ బ్రదర్స్ మల్లేష్, రాంరెడ్డి, సత్తయ్య యాదవ్, కేశవరావు, ఉప్పలయ్య, డాక్టర్ రమేష్, బండల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌రావునగర్‌లో 'ఇంటింటికి తెలుగుదేశం'



ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో టీడీపీ నేతలు

కాప్రా: టీటీడీపీ రాష్ట్ర కార్యదర్శి నీరుకొండ సతీష్‌బాబు ఆధ్వర్యంలో ఏఎస్‌రావునగర్ డివిజన్ జమ్మిగడ్డలో ఆదివారం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి తిరిగి టీడీపీతోనే సాధ్యమని పార్టీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి జ్యోత్స్న, సాయినాగార్జున, రాములుయాదవ్, వెంకటేష్, జంగారెడ్డి, హేమంత్‌కుమార్, గోపి, చంద్రశేఖర్, వినయ్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



చర్లపల్లిలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

కుషాయిగూడ: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని చర్లపల్లి డివిజన్ ఈసీనగర్‌లో ఆదివారం మహిళలకు సన్మాన కార్యక్రమం చేపట్టగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై వారిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, డప్పు గిరిబాబు, ప్రభాకర్‌రెడ్డి, రెడ్డినాయక్, మల్లారెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



అశోక్‌కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హన్మంతరావు

అల్వాల్: ఓల్డ్ అల్వాల్‌లో నివసించే మన్నె అశోక్‌కుమార్ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదివారం అశోక్‌కుమార్ నివాసానికి వెళ్లి మృతుడి కుమారుడు అశ్విన్, కుమార్తె ఆర్తితో పాటు వారి ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు.

'సెయింట్ జాన్స్'లో రంగోలి పోటీలు

మౌలాలి: అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకొని నేరేడ్‌మెట్ సెయింట్ జాన్స్ హై స్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో రంగోలి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రిన్సిపాల్ రేబెకమన్మోహన్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్ రేబెక మన్మోహన్



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈసీఐఎల్ నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసీఐఎల్ నుంచి కొండపోచమ్మ డ్యామ్ వరకు దాదాపు 60 బైక్‌లతో ర్యాలీగా వెళ్లారు. ఈ బైక్ ర్యాలీని ఏఎంఆర్ ప్లానెట్ డైరెక్టర్లు రాకేష్‌రెడ్డి, అనంత్‌లు జెండా ఊపి ప్రారంభించారు. – కుషాయిగూడ

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం



లోతుకుంటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల నేతలు

అల్వాల్: భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, దానిని రక్షించుకోవాల్సి బాధ్యత మనందరిపై ఉందని దళిత, అంబేడ్కర్ సంఘాల పరిరక్షణ కమిటీ సభ్యులు అన్నారు. ఆదివారం అల్వాల్ సర్కిల్ పరిధిలోని లోతుకుంటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి జ్ఞానమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆస శ్రీరాములు, దళిత సంఘాల సీనియర్ నాయకులు సీఎల్ యాదగిరి, కేడి, రమేష్, అశిష్ తదితరులు పాల్గొన్నారు.

నాగ దేవత విగ్రహ ప్రతిష్ఠాపన



నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో భక్తులు

ఉప్పల్: ఐడీఏ ఉప్పల్ వెలుగుట్టలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. విగ్రహానికి హోమం, అభిషేకం వంటి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాగదేవత విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో భారతమ్మ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న వెంకటేశ్ యాదవ్

బోడుప్పల్: కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గుర్రాల వెంకటేశ్‌యాదవ్ అన్నారు. 24వ డివిజన్ పరిధిలోని ఈస్ట్ జ్యోతినగర్‌లో ఆదివారం ఆయన పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈస్ట్ జ్యోతినగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.